
సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

# పాలమూరుకు మొండిచేయి

- ఉమ్మడి జిల్లాలోని మిగతా ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్
- 2025 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
- మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష
- హాజరైన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాజనర్సింహ, జూపల్లి, ఎంపీలు, ఎమ్మెల్యేలు
- పర్యటన నేపథ్యంలో ముందస్తు అరెస్టులు..
- రివ్యూ సమయంలో కరెంట్ పోకుండా అధికారుల తంటాలు

మహబూబ్‌నగర్, జూలై 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి పాలమూరు జిల్లాకు వరప్రదాయిని పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సీఎం రేవంత్‌రెడ్డి చేయిచ్చారు. పెండింగ్ ప్రాజెక్టులపై మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో మంత్రులు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, నీటిపారుదల శాఖ సలహాదారులు, ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిసి సీఎం సమీక్ష నిర్వహించారు. నీటి పారుదల, వైద్య, ఆరోగ్య శాఖ, విద్యా, సంక్షేమం, పర్యాటక శాఖలు, అన్ని ప్రాజెక్టుల పనుల పురోగతిపై నివేదిక అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యి కేవలం కాల్వలు మాత్రమే తవ్వితే 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పక్కకు పడేశారు. ఈ ప్రాజెక్టు మినహా మిగతా పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించడం విస్మయానికి గురిచేస్తోంది. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ పథకాలను పరిశీలించి ఫీల్డ్ విజిట్ రిపోర్ట్ పంపించాలని, నెట్టెంపాడు ప్రాజెక్టు డిజైన్‌ను మార్చే విషయంలో అధికారులు నిర్ణయం తీసుకోవాలన్నారు. 2025 నాటికి ఈ ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలని చెప్పారు. కానీ ఇప్పటికే ప్రాజెక్టులన్నీ దాదాపు పూర్తయ్యాయి. కేవలం ఒక్క పాలమూరు లిఫ్ట్ చివరి దశ పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. మిగతావి ఆపడం వెనుక ఆంతర్యమేమిటో అర్థంకావడం లేదని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కాగా సమీక్షలో మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, పీసీసీ కార్యదర్శి వినోద్, గద్వాల తాజా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలోని కొందరు కాంగ్రెస్ నేతలు అధికారులతోపాటు కూర్చోవడం చర్చనీయాంశంగా మారింది. సీఎం పర్యటన నేపథ్యంలో పలువురు నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అలాగే సమీక్ష జరిగినంతసేపు కరెంట్ పోకుండా అధికారులు తంటాలు పడ్డారు.

***విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు..***

విధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు ఇస్తున్నామని ఆయనన్నారు. రాష్ట్ర సచివాలయం నుంచి గ్రామపంచాయతీ వరకు ఫేస్ రికగ్నైజేషన్ యాప్ అందుబాటులోకి తీసుకొస్తామని ఉద్యోగులను పరోక్షంగా హెచ్చరించారు. కలెక్టర్ వారానికోసారి దవాఖానలు, పాఠశాలలను తనిఖీ చేయాలని, డీఈవోలు, ఎంఈవోలు ప్రతి రోజూ పాఠశాలలను తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాజెక్టులను వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేయాలన్నారు. అన్ని ప్రాజెక్టులపై స్టేటస్ రిపోర్ట్ అందజేయాలని ఆదేశించారు. పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద భూసేకరణలో పెండింగ్ చెల్లింపులను వెంటనే చేయాలని, పెండింగ్ బిల్లులను రెండో ప్రాధాన్యత కింద చెల్లించాలన్నారు. నెట్టెంపాడు ప్రాజెక్టును మరోసారి రీ ఎగ్జామిన్ చేసి సాంకేతిక సమస్యలను గుర్తించాలన్నారు. ప్రాజెక్ట్ పూర్తికి ఎంత సమయం పడుతుంది? ఎన్ని నిధులు కావాలో స్పష్టంగా అధికారులు నివేదిక అందజేయాలని సూచించారు. ఆర్డీఎస్‌కు సంబంధించి కర్ణాటక, ఏపీతో చర్చించాల్సిన విషయాలు, పరిష్కరించాల్సిన అంశాలను రూపొందించాలన్నారు. తుమ్మిళ్ల లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తికి, ఆర్డీఎస్‌పై కొత్త ప్రతిపాదనకు ఏమేం కావాలో ప్రణాళికలు తయారు చేయాలని అధికారులకు చెప్పారు. భీమా లిఫ్ట్ ఇరిగేషన్‌పై సమీక్షిస్తూ.. కానాయపల్లి ఆర్‌అండ్‌ఆర్ సమస్యను తక్షణమే పరిష్కరించాలన్నారు. గ్రామసభ నిర్వహించి రీసర్వే, ప్రాజెక్టు నిర్మాణంలో ఇండ్లు, భూములు కోల్పోయిన వారికి పునరావాసం కల్పించాలన్నారు. ఆర్‌అండ్‌ఆర్ సమస్య లేకుండా కోయిల్‌సాగర్ ప్రాజెక్టు రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచేందుకు పరిశీలించాలని, హజిలాపూర్, చౌదర్‌పల్లి, నాగిరెడ్డిపల్లి లిఫ్ట్ ఇరిగేషన్లకు నీటి లభ్యతను అంచనా రూపొందించాలన్నారు. 2025 డిసెంబర్ నాటికి కోయిల్‌సాగర్ ప్రాజెక్టును పూర్తి చేస్తామని ఇంజినీర్లు చెప్పారు. అన్ని ప్రాజెక్టుల కింద భూసేకరణ ఆర్‌అండ్‌ఆర్ చెల్లింపులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, పెండింగ్ బిల్లుల చెల్లింపునకు వెంటనే చర్యలు చేపడతామని సీఎం స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్య శాఖలోని సమస్యలను అధిగమించేందుకు అధ్యయనం చేయాలని సీఎం అన్నారు. ప్రతి పంచాయతీలో ప్రభుత్వ పాఠశాల, మండలాల్లో జూనియర్, నియోజకవర్గంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యల పరిష్కారానికి మహబూబ్‌నగర్ నుంచే పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలని సూచించారు. అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు ప్రోత్సాహకాలు తదితర అంశాలపై ప్రభుత్వం పరిశీలిస్తున్నదన్నారు. కార్యక్రమాల్లో ఎంపీలు డీకే అరుణ, మల్లురవి, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్‌రెడ్డి, వంశీకృష్ణ, నారాయణరెడ్డి, శంకర్, మేఘారెడ్డి, శ్రీహరి, పర్ణికారెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, విజేయుడు, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అధికారులు ఉన్నారు.

## భర్త హత్య కేసులో భార్యకు యావజ్జీవ కారాగార శిక్ష

నారాయణపేట, జూలై 9 : భర్తను హత్య చేసిన కేసులో నిందితురాలికి యావజ్జీవ కారాగార శిక్షతోపాటు రూ.20వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి అబ్దుల్ రఫీ తీర్పునిచ్చారు. వివరాలోకి వెళితే మరికల్ మండలం పెద్దచింతకుంట గ్రామానికి చెందిన శ్రీనివాసులు, సుజాతలు భార్యాభర్తలు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. డిసెంబర్ 2022లో శ్రీనివాసులు హత్య గురికాగా, ఆయన మృతిపై భార్య సుజాతపై అనుమానం వ్యక్తం చేస్తూ మృతుని బంధువు పరమేశ్వర్ మరికల్ పోలీస్ స్టేషన్‌లో 7.12.2022న ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై అశోక్‌బాబు ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, సీఐ శ్రీకాంత్‌రెడ్డి చార్జీషీట్ నమోదు చేశారు. అనంతరం సీఐ రాంలాల్ విచారణ ప్రారంభించారు. అయితే సుజాతకు ఇతరులతో వివాహేతర సంబంధాలు ఉన్నాయని, భర్త మద్యం మత్తులో నిద్రిస్తుండగా ముఖంపై దిండు ఉంచి హత్య చేసినట్లు విచారణలో గుర్తించారు. ఈ ఘటనపై సాక్షుల వాంగ్మూలం విన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి అబ్దుల్ రఫీ నేరస్తురాలికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. కేసు విచారణ పారదర్శకంగా చేపట్టిన, నేరస్తురాలికి శిక్ష పడేలా చేసిన ప్రస్తుత సీఐ రాజేందర్‌రెడ్డి, ఎస్సై మురళీ, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ శంకరయ్య, కోర్టు డ్యూటీ అధికారులు బాల ఈరప్ప, శ్రీధర్, హనుమంతులను డీఎస్పీ లింగయ్య అభినందించారు.


గుడిపల్లి రిజర్వాయర్‌కు పారుతున్న నీళ్లు

## గుడిపల్లికి బిరబిరా కృష్ణమ్మ

- ఎంజీకేఎల్ఐ లిఫ్ట్-3 నుంచి రిజర్వాయర్‌కు పంపింగ్

నాగర్‌కర్నూల్, జూలై 9 : ఎట్టకేలకు గుడిపల్లి రిజర్వాయర్‌కు నీళ్లు చేరుకున్నాయి. కేఎల్ఐ అధికారులు రెండు మోటర్లను ప్రారంభించి నీటిని రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. ఆదివారం రాత్రి మొదటి మోటర్‌ను ప్రారంభించగా, ఎగువ ప్రాంతం నుంచి జొన్నలబొగుడకు నీటి ఉధృతి పెరగడంతో అక్కడి నుంచి రెండు మోటర్ల ద్వారా నీటిని ఎత్తిపోయడంతో గుడిపల్లి చేరుకుంటున్నాయి. మంగళవారం సైతం గుడిపల్లి వద్ద రెండో మోటర్‌ను ప్రారంభించి నీటిని రిజర్వాయర్‌లోకి వదులుతున్నారు. రిజర్వాయర్‌ను నిండిన తర్వాత కాల్వల ద్వారా చెరువులకు సరఫరా చేయనున్నట్లు కేఎల్ఐ డీఈ భద్రయ్య వెల్లడించారు. వర్షాకాలం కావడంతో జూరాలకు స్వల్పంగా నీరు వస్తుండడంతో ముందస్తుగా గుడిపల్లి రిజర్వాయర్‌ను నింపుతున్నారు.

## నేడు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ రాక


కొల్లాపూర్, జూలై 9 : మండలంలోని మొలచింతలపల్లి గ్రామంలో బుధవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య పర్యటించనున్నారు. గత నెలలో చెంచు ఈశ్వరమ్మ ఘటనపై పరిశీలనకు కమిషన్ చైర్మన్ వస్తున్నట్లు తెలుస్తోంది. బాధిత మహిళ కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం సాయంత్రం 4 గంటలకు కలెక్టరేట్‌కు వెళ్లి భూమి, అట్రాసిటీ కేసులపై సమీక్షించనున్నారని తాసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు.

# గులాబీ సత్తా చాటుతాం

- స్వార్థం కోసం పార్టీలు మారితే ప్రజలే బుద్ధి చెబుతారు
- దమ్ముంటే కృష్ణమోహన్‌రెడ్డి రాజీనామా చేయాలి
- నేతల ఇళ్లకు వెళ్లి సీఎం ఆహ్వానించడం సిగ్గుచేటు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కారును ఆశీర్వదిద్దాం
- 15న గద్వాలలో ప్రజాఆత్మగౌరవ సభ
- హాజరుకానున్న మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు
- బీఆర్ఎస్ గద్వాల జిల్లా సమన్వయకర్త ఆంజనేయగౌడ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయగౌడ్

గద్వాల, జూలై 9 : ఎవరెన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్‌కు ప్రజలే బలమని.. రానున్న రోజుల్లో గులాబీ జెండా సత్తా చాటుతామని బీఆర్ఎస్ గద్వాల జిల్లా సమన్వయకర్త ఆంజనేయగౌడ్ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పార్టీ ఫిరాయింపులు ఉండవని చెప్పిన రేవంత్‌రెడ్డి ప్రస్తుతం సిగ్గులేకుండా నాయకులు, ఎమ్మెల్యేల ఇంటికి వెళ్లడం వారిని లాక్కోవడం నీతి మాలిన చర్యగా ఆయన అభివర్ణించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ బీఆర్ఎస్‌ను ప్రజలకు దూరం చేయాలని చూస్తున్నదని, ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజల గుండెల్లో కారు, కేసీఆర్ సారు పదిలంగా ఉంటారన్నారు. రేవంత్‌రెడ్డి సర్కారు ప్రజాస్వామాన్ని ఖూనీ చేస్తున్నదని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో అన్ని జెడ్పీటీసీ స్థానాలతో పాటు జెడ్పీ చైర్మన్ పదవిని కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. 15వ తేదీన గద్వాలలో ప్రజా ఆత్మగౌరవ సభను ఏర్పాటు చేస్తున్నామని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజరవుతారని చెప్పారు. ప్రజా ఆత్మగౌరవ సభలో కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎలా మోసం చేస్తున్నదో ప్రజలకు వివరిస్తామన్నారు. దళితబంధు, రైతుబంధు, కౌలురైతుల కోసం అందరితో సభలు ఏర్పాటు చేస్తామన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో నడిగడ్డ అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. వలస వెళ్లిన వారు సైతం తిరిగొచ్చి సంతోషంగా బతుకుతున్నారని, ప్రస్తుతం కాంగ్రెస్ రాకతో మళ్లీ బాధలు మొదలయ్యాయని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ పాలనలో ర్యాలంపాడ్ రిజర్వాయర్ నిర్లక్ష్యానికి గురైందని, రాష్ట్ర ఏర్పాటు తర్వాత పూర్తి చేసి 2లక్షల ఎకరాలకు సాగునీరందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ 450 సంక్షేమ పథకాలు అమలు చేశారని, నడిగడ్డ ప్రజల్లో గులాబీ జెండా ఎప్పటికీ ఉంటుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో బంగ్లా-బండ్లను ఓడించాలని పిలుపునిచ్చిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు బండ్లను భుజాలపై ఎత్తుకొని మోస్తున్నాడని ఆరోపించారు. ఎవరు పార్టీని వీడినా ఒరిగేదేమీ లేదని, కలిసికట్టుగా పనిచేసి స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్ సత్తాచాటుతామని చెప్పారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వెంకట్రాములు మాట్లాడుతూ ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి తన స్వలాభం కోసం పార్టీ మారాడే తప్పా ప్రజల సంక్షేమం కోసం కాదన్నారు. త్వరలోనే ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో గట్టు మాజీ సర్పంచ్ హన్మంతునాయుడు, నాయకులు బాసు హన్మంతు, మోనేష్, అతికూర్ రహెమాన్, మల్లికార్జున్, మంద మల్లి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# గోల్‌మాల్ గోవిందా!

### వనపర్తి విద్యుత్ శాఖలో అధికారుల ఇష్టారాజ్యం

- కాంట్రాక్టర్ అవతారమెత్తిన ఉద్యోగుల బంధుగణం
- అందినకాడికి దండుకొని..
- టెండర్లు లేకుండానే పనుల అప్పగింత
- ఏసీబీ దాడుల నేపథ్యంలో వర్క్ పెండింగ్
- కొత్త, పాత కాంట్రాక్టర్ల మధ్య రాజుకున్న అగ్గి

**అధికారుల అండదండలు..**

వనపర్తి జిల్లా విద్యుత్ శాఖలోని వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల బంధువులు కాంట్రాక్టర్ల అవతారమెత్తారు. 20 ఏండ్ల కిందటి వరకు విద్యుత్ శాఖలో పనులు చేసే కాంట్రాక్టర్లు కేవలం 30 మంది మాత్రమే ఉండేవారు. కానీ, కేవలం మూడేండ్లలోనే దాదాపు 30 మంది కాంట్రాక్టర్లు కొత్తగా పుట్టుకొచ్చారంటే అధికారుల తీరు ఎలా ఉందో ఇట్టే అర్థమవుతుంది. కింది నుంచి పై వరకు పనిచేసే ఉద్యోగుల కుటుంబసభ్యులు, బంధువులు కాంట్రాక్టర్లుగా పనిచేస్తున్నారు. జిల్లాస్థాయి అధికారులే సహకరిస్తుండడంతో వీరికి ఎదురులేకుండా పోయింది. ఎక్కువ డబ్బులకు ఆశపడి పనులను సైతం వీరికే కట్టబెడుతుండడంతో పాత, కొత్త కాంట్రాక్టర్ల మధ్య అగ్గి రాజుకున్నది. కొత్తగా వచ్చిన వారికి పనులను అప్పగించిన సందర్భంలోనే ఏసీబీ అధికారుల దాడులు జరిగినట్లు చర్చ కొనసాగుతున్నది.

వనపర్తి, జూలై 9 (నమస్తే తెలంగాణ) : విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ వ్యవస్థ అధికారుల కనుసన్నల్లో ఇష్టారాజ్యంగా నడుస్తున్నది. శాఖ పరంగా చేపట్టే పనులకు టెండర్లు లేకుండా డబ్బులకు ఆశపడి ఎడాపెడా పనులను అప్పగించడం వివాదంగా మారుతున్నది. దీంతో ఎప్పుడో చేయాల్సిన పనులు రెండేండ్లుగా పెండింగ్‌లోనే పడుతున్నాయి. దీన్ని బట్టి అధికారుల పని తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ శాఖలో పనిచేస్తున్న ముగ్గురు అధికారులు ఏసీబీ అధికారులకు పట్టుబడడంతో రైతుల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల పనులన్నీ అటకెక్కాయి.

***టెండర్ ప్రక్రియ లేనేలేదు..***

విద్యుత్ శాఖలో చేపట్టే పనులకు టెండర్లు లేకుండా నామినేషన్ పద్ధతిలో అప్పగిస్తున్నారు. రూ.50 వేలకు మించితే టెండర్లు కచ్చితంగా ఉండాలి. అయితే, చిన్న, పెద్ద పనులంటూ తేడా లేకుండా అన్నింటినీ నచ్చిన వారికే ముట్టజెబుతున్నారు. అందినకాడికి దండుకొని రాత్రికి రాత్రే ఆర్డర్లు జారీ చేస్తుమమ అనిపిస్తున్నారు. రూ.కోట్ల పనులను సైతం విభజించి తమకు అనుకూలంగా ఉన్న వారికి కట్టబెడుతున్నారు. వనపర్తి జిల్లావ్యాప్తంగా ఇలా పనులను అప్పజెప్పడం వల్లే సమస్య ముదిరింది. గతంలో ఏ పనులకైనా టెండర్లు నిర్వహించే పరిస్థితి ఉండేది. కాగా, రెండు, మూడేండ్ల నుంచి టెండర్ వ్యవస్థకు పూర్తిగా బ్రేకులు పడ్డాయి. పెద్ద పనులను సైతం మూడో కంటికి తెలియకుండా.. టెండర్లు లేకుండానే ఇష్టానుసారంగా అప్పజెబుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వ్యవసాయ విద్యుత్ పనులే కాకుండా కమర్షియల్ పనులను సైతం లోలోపల ఒప్పందాలు చేసుకొని నామినేషన్ పద్ధతిలో మమ అనిపిస్తున్నారు. జిల్లాలో పలుచోట్ల చేపట్టిన ఇండియన్ గ్యాస్ గోదాంల విద్యుత్ పనుల్లో కూడా పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరిగినట్లుగా ఆరోపణలున్నాయి.

***ముదిరిన వివాదం..***

విద్యుత్ పనుల కేటాయింపుల్లో వివాదం ముదిరింది. గతంలో పనిచేసిన ఓ అధికారి తనకు నచ్చిన వారితో ఒప్పందం చేసుకొని కొన్ని పనులను అప్పగించారు. దీంతో మిగతా కాంట్రాక్టర్లు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. ఈ క్రమంలో ఆ పనులన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి. నచ్చిన వారికి ఇచ్చి తమకు మొండి చేయి చూపిస్తే.. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు మిగిలిన కాంట్రాక్టర్లు సిద్ధం కావడంతో సమస్య మరింత జఠిలమైంది. ఇదిలా ఉంటే, బదిలీల ప్రక్రియను ముందే ఊహించిన అధికారులు.. ఇక తాము కూడా వెళ్లిపోతామనే లక్ష్యంతో అందినకాడికి దండుకొని కొందరికి పనులను అప్పగించడం మరింత వివాదానికి దారితీసింది. ప్రస్తుతం ఆ అధికారులు ఏసీబీ ట్రాక్‌లో పడడంతో పరిస్థితి ఉల్టా పల్టా అయింది. ఇప్పటికైనా మార్గదర్శకాలను పాటిస్తూ పనులను పారదర్శకంగా నిర్వహించకుంటే మరిన్ని వివాదాలకు దారులు తెరిచినట్లవుతుంది.


విద్యార్థినులకు శానిటేషన్ ప్యాడ్‌లు పంపిణీ చేస్తున్న పర్ణికారెడ్డి, మంచులక్ష్మి

## కొల్లంపల్లిలో డిజిటల్ తరగతులు

- ప్రారంభించిన ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, సినీ నటి మంచులక్ష్మి

నారాయణపేట రూరల్, జూలై 9 : టీచ్ ఫర్ చేంజ్, వెనిరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని కొల్లంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్‌రూంను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, సినీనటి, ఫౌండేషన్ సీఈవో మంచులక్ష్మి, ఫౌండర్ రత్నారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంచులక్ష్మి మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నారాయణపేట నియోజకవర్గంలోని 4 మండలాల్లో 16 పాఠశాలలను డిజిటల్ తరగతులు బోధించేందుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. రూ.50 లక్షలతో పనులు చేపడుతున్నామని వెల్లడించారు. వెనుకబడిన గ్రామాల్లో ఇలాంటి ప్రాజెక్టుల ద్వారా పేదలకు మేలు చేకూరుతుందన్నారు. అనంతరం 9, 10వ తరగతుల బాలికలకు ఆరు వేల శానిటేషన్ ప్యాడ్లు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మాట్లాడుతూ వెని ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిజిటల్ తరగతులను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీఈవో అబ్దుల్‌ఘని, ఏఎంవో విద్యాసాగర్, ఎంఈవో గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీల అమలు అసాధ్యం

- చేతగాకే కాంగ్రెస్ కాలయాపన
- పదవులు కాదు చేసిన పనులే శాశ్వతం..
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్


తాజా మాజీ మండల పరిషత్ సభ్యులను సన్మానిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పాలమూరు, జూలై 9 : కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు అసాధ్యమని, ఇది తెలిసే టైంపాస్ రాజకీయాలు చేస్తున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలం అప్పాయపల్లిలో ఇటీవల పదవీకాలం పూర్తి చేసుకున్న మహబూబ్‌నగర్ మండల పరిషత్ సభ్యులను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా.. పదేండ్లు తెలంగాణను అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిన బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేయడమే పనిగా పెట్టుకున్నదన్నారు. ప్రజలు ప్రభుత్వ తీరును గమనిస్తున్నారని, తగిన సమయంలో సమాధానం చెప్తారన్నారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి పాలన చేతగాక కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ సర్కారులో పార్టీలకతీతంగా అన్నివర్గాల సంక్షేమానికి పాటుపడ్డామన్నారు. ఎవరికి ఏ ఆపద వచ్చినా అండగా నిలబడ్డామని చెప్పారు. మన్యంకొండ ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేశామన్నారు. అధికారం లేకపోయినా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, తాజా మాజీ ఎంపీపీ సుధాశ్రీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, ఆంజనేయులు, అల్లావుద్దీన్, శ్రీకాంత్‌గౌడ్, రాఘువేందర్ గౌడ్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయుడు శ్రీశైలం

## మమ్మల్ని విడిచి వెళ్లొద్దు సార్..

- ఉపాధ్యాయుడు శ్రీశైలం బదిలీలో విద్యార్థుల కన్నీటి పర్యంతం

అచ్చంపేట రూరల్, జూలై 9 : 'మమ్మల్ని విడిచి వెళ్లొద్దు సార్' అంటూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడిని చిన్నారులు కన్నీరు పెట్టుకుంటూ వేడుకున్న ఘటన మండలంలోని నడింపల్లి ప్రాథమిక పాఠశాలలో చోటుచేసుకున్నది. నాగిళ్ల శ్రీశైలం తొమ్మిదేండ్లుగా పాఠశాలలో పనిచేస్తున్నాడు. విద్యతోపాటు సమాజంపై అవగాహన ఉండాలనే ఉద్దేశంతో ప్రత్యేక కృత్యాలను తయారు చేసి ప్రత్యేకంగా బోధించేవారు. పండుగలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులను ఎంతో ప్రోత్సహించారు. విద్యార్థులకు చదువంటే ఇష్టంగా మారేలా మెలిగేవారు. దీంతో ఇన్నేళ్లు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుడు వెళ్తుంటే ఆ పాఠశాల విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఉపాధ్యాయుడి బదిలీని జీర్ణించుకోలేకపోతున్నారు. 1998లో ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన శ్రీశైలం గట్టు మండలం సల్కాపూర్, అచ్చంపేట మండలం బుడ్డతండా, బల్మూరు మండలం తుమ్మన్‌పేట, నడింపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేశారు. ఎక్కడ పనిచేసినా తన ప్రత్యేకతను చాటుతూ వచ్చారు.